
కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మునుపెన్నడూ లేనంత ప్రాధాన్యం ఇచ్చారని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కృషి ఫలించిందని అంటున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మంగళవారం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో కేటాయిపులు జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తాయని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంలో ఉత్పాదకత పెంపు, ఉద్యోగాల కల్పనకు నైపుణ్యాల పెంపు, మానవ వనరుల అభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, పరిశోధనలు తదితర తొమ్మిది అంశాలకు కేంద్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇవన్నీ జిల్లా అభివృద్ధికి ఉపయుక్తమైనవే. పారిశ్రామికాభివృద్ధి, వ్యవసాయం, అనుబంధ రంగాలలో ఉత్పాదకత పెరుగుదల, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం, రహదారుల నిర్మాణం వంటివి జిల్లా అభివృద్ధికి ఊతమిచ్చేలా ఉన్నాయి.

- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి, హిందూపురం



ఇక ఉపాధికి ధోకా ఉండదు..



అభివృద్ధికి బాటలు

ప్రత్యేక ప్యాకేజీ..

ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ అందాల్సి ఉంది. దీనికి బడ్జెట్‌లో చోటు కల్పించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇవ్వనున్నారు. ఇది జిల్లాకు మేలు చేసే అంశం. హైదరాబాద్-ఓర్వకల్లు, బెంగుళూరు పారిశ్రామిక కారిడార్‌అభివృద్ధికి ప్రత్యేక సహకారం ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీంతో జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందనుంది. పూర్వోదయ పథకం కింద ఉపాధి కల్పన, మౌళిక సదుపాయాల కల్పనకు తద్వారా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించారు. పారిశ్రామిక కారిడార్లల్లో నీరు, విద్యుత్, రైల్వే, రహదారులకు భారీగా నిధులు ఇస్తారు. జిల్లాలో చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఈలు) పరిశ్రమలకు రుణం గ్యారెంటీ ఇవ్వనున్నారు. తద్వారా కొత్త పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. యువతలో నైపుణ్యాలను పెంపుతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వెరసి.. జిల్లా తయారీ రంగంలో హబ్‌గా మారుతుంది.



అప్పట్లోనే అభివృద్ధి..

2014-19లోనే టీడీపీ ప్రభుత్వం జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపింది. జాతీయ స్థాయి సంస్థలు నాసిన్, బెల్, ఎయిర్ బస్‌తో పాటు అంతర్జాతీయ కార్ల తయారీ పరిశ్రమ కియను జిల్లాకు తీసుకొచ్చింది. కియ ఏర్పాటుతో జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా అవతరించింది. తాజా కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు తోడ్పాటు ఇస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉంది. ఫలితంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ వే వెంట పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేసి, ప్రోత్సాకాలు ఇస్తామని ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. అంతరాష్ట్ర, జిల్లా రహదారులను అనుసంధానం చేస్తూ.. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు కేంద్రం సహకారం ఇవ్వబోతోంది. ఓవైపు వెనుకబడి ప్రాంతాలకు వచ్చే ప్రత్యేక నిధులు, విశాలమైన జాతీయ రహదారుల ఏర్పాటు జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తాయి. ఇక్కడి భూముల విలువ మరింత పెరుగుతుంది.

పేదలకు ఇళ్లు సంతోషకరం..



కేంద్ర వార్షిక బడ్జెట్ ప్రజా శ్రేయస్సు, సంక్షేమ బడ్జెట్. పీఎం ఆవాస్ యోజన కింద పేదలకు మూడు కోట్ల ఇళ్లను నిర్మిస్తామని ప్రకటించడం సంతోషకరం. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లతోపాటు భవిష్యత్తు అవసరాలను బట్టి మరిన్ని నిధులు కేటాయిస్తామనడం హర్షణీయం. రాష్ట్ర విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణానికి నిధుల కేటాయింపు, పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం ప్రత్యేక సహకారం అందించడం మంచి నిర్ణయాలు. హైదరాబాద్-బెంగళూరు, విశాఖ-చెన్నై, పారిశ్రామిక కారిడార్లకు కేంద్రం ప్రత్యేక నిధులు కేటాయించింది.

- జీఎం శేఖర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

మంత్రి సత్యకుమార్ యాదవ్



ధర్మవరం, జూలై 23: ఆంధ్రప్రదేశ్ అబివృద్ధికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని నిర్మాణం కోసం స్పెషల్ సపోర్టింగ్ కింద కేంద్ర బడ్జెట్‌లో ఈ ఏడాదికి రూ.15వేల కోట్లు కేటాయించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్థిక మంత్రి ప్రకటించడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పట్ల ఎన్డీఏ ప్రభుతానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుకు కేంద్రం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ బడ్జెట్ ద్వారా మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవధార పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందించడం రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తుందని హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమ, ప్రకారం, ఉత్తరాంధ్రలోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు అందించడం ఆ ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు.

సంతృప్తికరమైన బడ్జెట్..



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సుముచిత స్థానం లభించడం సంతృప్తినిచ్చింది. అన్ని ప్రాంతాలు, అన్ని రంగాల అభివృద్ధికి కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషి ఫలించింది. కూటమి సారథ్యంలో ఏపీ అభివృద్ధి పరుగులు పెడుతుంది. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో వస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారు. మాపై నమ్మకంతో భారీగా మెజార్టీతో గెలిపించారు. ఆ నమ్మకం ఈ రోజు వాస్తవరూపం దాల్చింది. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహకారం, హైదరాబాదు- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు అభివృద్ధికి సహకారం, వెనుబడిన ప్రాంతలకు ప్రత్యేక నిధుల కేటాయింపు వంటివి ఏపీకి వరాల జల్లులు. హైదరాబాదు- బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధితో జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో గణనీయంగా మార్పు వస్తుంది. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

- బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ

ఆదుకునే బడ్జెట్..



కేంద్ర వార్షిక బడ్జెట్ మన రాష్ట్రాన్ని ఆదుకునేలా ఉంది. అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయం. పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పడం స్వాగతించదగ్గ విషయం. బంగారం, వెండిపై కస్టమ్స్ పన్ను తగ్గించడం మధ్యతరగతి ప్రజలకు ఊరటనిస్తుంది. క్యాన్సర్ రోగులు ఉపయోగించే మందుల ధరలు తగ్గించాలని తీసుకున్న నిర్ణయం చాలా మంచిది. విభజన చట్టం ప్రకారం హామీలు నెరవేర్చేలా బడ్జెట్ ఉంది. విశాఖ-చెన్నై, బెంగళూరు-హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పడం రాయలసీమ ప్రజలకు గొప్ప ఊరటనిస్తుంది.

- నందమూరి బాలకృష్ణ, హిందూపురం ఎమ్మెల్యే

సీఎం చంద్రబాబు కృషి వల్లే నిధులు

పరిటాల శ్రీరామ్



ధర్మవరం, జూలై 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషివల్లే రాష్ట్రానికి నిధులు వస్తున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి రాగానే కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకువచ్చి, అభివృద్ధి చేస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు తొలి బడ్జెట్‌లోనే ఏపీకి నిధులు తెచ్చారని అన్నారు. అమరావతిని నాశనం చేయాలని వైసీపీ పాలకులు చూశారని, ఇప్పుడు స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రే అమరావతి గురించి ప్రస్తావించారని, రూ.15 వేల కోట్లు కేటాయించారని అన్నారు. ఏపీకి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని, అందుకు అవసరమైన నిధులు కేటాయిస్తామని చెప్పడం శుభవార్త అని అన్నారు. ఇక పోలవరం, రాజధాని నిర్మాణ పనులు పరుగులు పెడతాయని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకోసం ప్రత్యేక రాయితీలను ఇస్తామని చెప్పడం వల్ల రాష్ట్రంలో పారిశ్రామకాభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. ఏపీలో నీరు, విద్యుత్, రైల్వే, రోడ్ల ప్రాజెక్టులకు దశలవారీగా నిధులు కేటాయించడం వల్ల ఇన్ని రోజులు జరిగిన నష్టాన్ని పూడ్చుకోవచ్చని, ఇకపై సరికొత్త ఆంధ్రప్రదేశ్‌ను చూస్తారని అన్నారు. రాయలసీమ సహా వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం ప్రకటించడం పట్ల పరిటాల శ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు.

జనరంజక బడ్జెట్..



కేంద్ర బడ్జెట్ సకల జనులకు ఆమోదయోగ్యంగా ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్ని వర్గాల అభ్యున్నతికి నిధులు కేటాయించారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు మంజూరు చేయడం, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి పారిశ్రామిక రాయితీలు ఇవ్వడం హర్షణీయం. ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడం, మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం ఊరటనిస్తుంది.

- పీడీ పార్థసారథి, బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి

బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట..



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటన కలిసొచ్చింది. రాష్ట్రాన్ని ఆదుకునేలా కేంద్ర పెద్దలను ఆయన ఒప్పించారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసింది. చంద్రబాబు మాత్రం రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, బెంగళూరు-హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చేస్తామని చెప్పడం సంతోషకరం.

- కొల్లకుంట అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

మేడంపై చీటింగ్ కేసు

స్వయం సహాయక సంఘాల్లో డబ్బుల వాడకం

పోలీసులకు టీఎల్ఎఫ్ సభ్యుల ఫిర్యాదు

అధికారులకు మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బెదిరింపులు



కదిరి మున్సిపాలిటీ కార్యాలయం

కదిరి, జూలై 23: స్వయం సహాయక సంఘాల్లో డబ్బులు తీసుకుని, తిరిగి చెల్లించకుండా గ్రూపు సభ్యులను మోసం చేశారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. దీంతో వైస్ చైర్‌పర్సన్‌తోపాటు ఆమె భర్త (వైసీపీ నాయకుడు) అధికారు లను బెదిరిస్తున్నట్లు సమాచారం. అధికారులతోపాటు కేసు పెట్టిన టీఎల్ఎఫ్ సభ్యులు సైతం ఆందోళన చెందుతున్నారు. వైస్ చైర్‌పర్సన్‌పై కేసు నమోదు కావడంతో మిగిలిన అక్రమార్కుల్లో భయం నెలకొన్నట్లు సమాచారం. మున్సిపాలిటీలో అక్రమాలు చేసిన ప్రజాప్రతినిధులతోపాటు, కొంతమంది అధికారులు కూడా బెంబేలెత్తుతున్నట్లు తెలిసింది. తరువాత ఎవరిపైన కేసులు నమోదు అవుతాయో అనే భయం వారిలో నెలకొన్నట్లు సమాచారం. ఇప్పటికే డీజిల్, అక్రమ లేఅవుట్లలో అవినీతి బయట పడింది. దీంతో మున్సిపాలిటీలో అక్రమాలు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు కేసుల నుంచి తప్పించుకోవడం కోసం టీడీపీ నాయకులు, ఇతర అధికారులతో రాయబారం నడుతున్నట్లు సమాచారం.

అధికారులకు బెదిరింపులు

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవిపై చీటింగ్‌కేసు నమోదు కావడంతో ఆమె మెప్మాలో పనిచేస్తున్న అధికారులను బెదిరిస్తున్నట్లు సమాచారం. నాపైనే కేసు పెట్టిస్తారా, మీకథ చూస్తానంటూ బెదిరించినట్లు తెలిసింది. దీంతో అధికారులు విధులు నిర్వహించడానికి భయపడుతు న్నారు. అక్రమలు చేసికూడా తమపై బెదిరింపులు ఏమిటని వారు వాపోతు న్నారు. అలాగే టీడీపీ నాయకులను నిందిస్తున్నట్లు తెలిసింది.

కేసు పూర్వాపరాలు

కొమ్ము గంగాదేవి వైస్ చైర్‌పర్సన్ కాకముందు అమీనియా ఎస్ఎల్ఎఫ్‌కు అధ్యక్షురాలిగా ఉంది. టౌన్‌లెవన్ ఫెడరేషన్‌లో కోశాధికారిగా కూడా ఉండేది. గంగాదేవి 20-4-2022లో రూ.రెండు లక్షలు ఒకసారి, రూ.లక్ష మరోసారి టీఎల్ఎఫ్ నుంచి అమీనియా ఎస్ఎల్ఎఫ్‌కు జమ చేయించారు. తరువాత 22-4-2022న ఎస్ఎల్ఎఫ్‌లో ఉన్న రూ.మూడు లక్షలను ఎటువంటి తీర్మానం లేకుండానే తన ఖాతాలో వేసుకున్నారు. అప్పటి నుంచి రెండు సంవత్సరాలపాటు గ్రూపు సభ్యులు ఎన్నిమార్లు అడిగినా డబ్బు చెల్లించలేదు. 28-4-2023న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇదేంది మేడం శీర్షికన కథనం ప్రచురితం కావడంతో వైస్ చైర్‌పర్సన్ డబ్బు చెల్లించని విషయం బయటకు పొక్కింది. ఆ తరువాత కౌన్సిల్‌లోనూ, మెప్మాలోనూ అలజడి రావడంతో అప్పుడు కొంత అప్పుడు కొంత రూ.1.25లక్షలు చెల్లించింది. వడ్డీ మొదలు, పాత బాకీ మొదలుకుని ఈనెల 22కి రూ.4.12లక్షల అయింది. అందులో నుంచి గంగాదేవి కట్టిన రూ.1.25లక్షలు పోనూ ఇంకా సంఘానికి రూ.2.87లక్షల అప్పు ఉన్నట్లు మెప్మా అధికారులు ఆడిట్‌లో తేల్చారు. సంఘం తీర్మానం లేకుండా సంఘం డబ్బులను తన ఖాతాకు మళ్లించుకోవడం, తిరిగి చెల్లించకపోవడంపై టీఎల్ఎఫ్ సభ్యులు ఈనెల 22న పోలీసులకు ఫిర్యాదు చేయగా, మంగళవారం కేసు నమోదు చేశారు.

శాకంబరిగా వాసవీమాత

ధర్మవరం రూరల్, జూలై 23 : ఆషాఢమాసం మంగళవారాన్ని పురష్కరించుకుని పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవీ ఆలయంలో అమ్మవారిని శాకాంబరీగా అలంకరించారు. కన్యకాపరమేశ్వరి మూలవిరాట్‌కు శ్రీవాసవీ మహిళ మండలి ఆధ్వర్యంలో 1000 కేజీల 30 రకాల కాయగూరలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాసవీ మహిళ మండల అధ్యక్షురాలు రూపరాగిణి, కార్యదర్శి కాకుమాని కళ్యాణి, కోశాధికారి నల్లపేట మంజు సంయుక్త, సభ్యులు పాల్గొన్నారు.



శాకాంబరి అలంకరణలో అమ్మవారు

భూగర్భ డ్రైనేజీకి నిధులివ్వండి

ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి, జూలై 23: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుట్టపర్తిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. అమరావతిలో మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో పుట్టపర్తి నియోజకవర్గ సమస్యలను ఆమె ప్రస్తావించారు. సత్యసాయి నడయాడిన పుట్టపర్తికి ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని అన్నారు. గతంలో ఏర్పాటు చేసిన అండర్‌గ్రౌండు డ్రైనేజీ వ్యవస్థ విఫలమైందని, దీంతో మురుగునీరు చిత్రావతిలో కలుస్తోందని, నదీ జలాలు కలుషితమౌతున్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పురపాలకశాఖ మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ఇసుక రీచ్‌లను గుర్తించండి

అక్రమార్కులను వదలొద్దు

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, జూలై 23: జిల్లాలో కొత్త ఇసుక రీచ్‌లను గుర్తించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉచిత ఇసుక విధానంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొత్త ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయడానికి తహసీల్దార్లు, మైనింగ్ అధికారులు ఇసుక దొరికే ప్రాంతాలను గుర్తించి, నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలు చేసేందుకు కృషిచేయాలని సూచించారు. చట్టవిరుద్ధంగా ఇసుకను నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం నేరమని, అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక సమస్యలపై ఫిర్యాదు కోసం టోల్ ఫ్రీ నంబరు 18004256041 ఏర్పాటు చేశామని, దీనిగురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మైనింగ్ అధికారులు వారంలో మూడుసార్లు ఇసుక డంపింగ్ యార్డులను పరిశీలించాలని, ఇసుక డంపింగ్ ఏరియాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టరు అపూర్వ భరత్, అడిషనల్ ఎస్పీ విష్ణు, మైనింగ్ అధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు టీఎస్ చేతన్

న్యూట్రిషన్ గార్డెన్‌పై అవగాహన కల్పించండి

పుట్టపర్తి, జూలై 23 : పోషక విలువలు కలిగిన న్యూట్రిషన్ గార్డెన్‌పై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టరు టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోషక ఆహార గార్డెన్ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి పోషణ శక్తి నిర్మాణ్ పథకం అమలుకు ప్రతిపాఠశాలలో స్కూల్ న్యూట్రిషన్ గార్డెన్ ప్రారంభించాలన్నారు. మొదటి విడతలో 121 పాఠశాలల్లో ప్రోగ్రాం చేపట్టాల్సి ఉందన్నారు. సాంకేతిక సహాయం, శిక్షణ, విత్తనాలు, నారు, ఎరువులు, ఉద్యానశాఖ, అటవీ శాఖ, సరిహద్దుగోడ నిర్మాణం, భూమిని చదును చేయడం తదితర కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఐసీడీఎస్ పీడీ నాగ మల్లేశ్వరి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య'కు ఎంపిక : మిషన్ వాత్సల్య పథకం ద్వారా తాత్కాలిక ప్రాతిపదికదిన స్పాన్సర్‌షిప్ పథకానికి 378 మంది పిల్లలను ఎంపిక చేశామని కలెక్టరు తెలిపారు. ఈస్పాన్సర్ అండ్ ఫాస్టర్ కేర్ అప్రూవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈపథకం ద్వారా అనాథ పిల్లలు, హెచ్ఐవీ ప్రభావిత పిల్లలు, పీఎం కేర్ పిల్లలు కొవిడ్ సెమీ ఆర్ఫన్ బాలబాలికలు ఇంటి వాతావరణంలో చక్కగా చదువుకోవడానికి చక్కగా ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, బాలల పరిరక్షణ అధికారి మహేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యంపై ధర్నా


ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు

కొత్తచెరువు, జూలై 23: విద్యుత్ సరఫరా సరిగా లేక టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయని, దీనిపై పలుమార్లు ట్రాన్స్ కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక బసవన్నకట్ట వీధికి చెందిన ప్రజలు మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. దాదాపు 400 గృహాలకు సింగల్ డీపీ ఉండటం వల్ల లో ఓల్టేజ్ వస్తోందని, దీంతో రాత్రి సమయాల్లో జీరో బల్బులు కూడా వెలగడం లేదని అన్నారు. తాము గత కొన్ని నెలలుగా కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీనిపై ట్రాన్స్‌కో ఏఈ, డీఈకి ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. తమ సమస్యను పరిష్కరించేవారకూ ధర్నాను విరమించేది లేదని తేల్చిచెప్పారు. డీఈ వారికి నచ్చచెప్పి కాలనీలో పర్యటించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

కొత్తచెరువు, జూలై 23 : స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ప్రజలకు బండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు సోకుతున్నాయని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైరల్ ఫీవర్, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలు సోకుతున్నాయని, కావున ప్రజలు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. తాగునీటిని కాచి చల్లార్చిన తరువాత తాగాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని రాజమోళ్లపల్లి తండాలో మంగళవారం సీజనల్ వ్యాధులపై డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ నాగేంద్రనాయక్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి, రక్త నమూనాలను సేకరించారు. ఇందులో వైద్యాధికారులు కల్పన, అలైఖ్య, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు, జూలై 23: మండలంలోని వివిధ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, జ్వరాలపై ఇంటింటా సర్వే చేస్తున్నట్లు డాక్టర్లు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు తెలిపారు. రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేసి, సర్వే కార్యక్రమం కొనసాగిస్తున్నామన్నారు. మంగళవారం మండలకేంద్రంలో సర్వే నిర్వహించారు. వారి వెంట సూపర్‌వైజర్ సూర్యనారాయణరెడ్డి, సిహెచ్ నాగమల్లిక, ఆరోగ్య, ఆశసిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కొత్తచెరువు, జూలై 23 : మండలంలోని మామిళ్ళ కుంట క్రాస్ ప్రశాంతి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. రైల్వే పట్టాలపై మృతదేహం పడి ఉంటాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో తాము సంఘటన స్థలానికి చేరుకున్నామన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉండవచ్చన్నారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి ఆచూకీ తెలిసిన వారు 91820 19510కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


ప్రశాంత్


విష్ణుప్రియ

కదిరి, (అమడగూరు), జూలై 23 : మండలంలోని మహమ్మదాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రశాంత్ 582, విష్ణుప్రియ 576 మార్కులు సాధించి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. వీరిందరు మండలంలోని తనకంటిపల్లికి చెందినవారు. ఈ విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

ధర్మవరం, జూలై 23: పట్టణంలోని శ్రీసాయిడిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. న్యాయవాదులు విజయ రాఘవేంద్ర, సుమలత మాట్లాడుతూ... సైబర్ క్రైమ్ పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పణికుమార్, న్యాయవాదులు భార్గవి, నరసింహమూర్తి, ప్రవీణ్, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు రాజేశ్వరి, నాగరత్న పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై అవగాహన


బడ్జెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపన్యాసకులు

ధర్మవరం, జూలై 23: కేంద్ర బడ్జెట్‌పై స్థానిక కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ద్వారా ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకులు చిట్టెమ్మ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, గోపాల్ నాయక్, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, మీనా, పుష్పవతి, సరస్వతి, ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

ఓబుళదేవరచెరువు, జూలై 23: మండలంలోని కొండకమర్ల సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. కార్యదర్శులు వర్షాకాలంలో మురుగునీరు నిలువ లేకుండా చూడడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కొండకమర్లలో మురుగు కాలువలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఈఓఆర్‌డీ రాజశేఖర్ ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తనకల్లు, జూలై 23: మండలంలోని చిన్నరామన్నగారిపల్లి, ఈతోడు గ్రామాల సమీపంలో ఉన్న అడవుల్లో చేపడుతున్న ఉపాధి పనులను జనజాగృతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంప్రసాద్ మంగళవారం పరిశీలించారు. జనజాగృతి సంస్థ ద్వారా ఈ ప్రాంతంలో అంతరించి పోతున్న అడవి జంతువుల సంరక్షణ కోసం కృషి చేస్తున్నామన్నారు.

వైసీపీ నేతల దౌర్జన్యకాండ

- చెలిమి ఆంజనేయస్వామి స్థలం కబ్జాకు యత్నం
- ఆలయ ప్రధాన గేటు నిర్మాణాన్ని ధ్వంసం చేసిన వైనం


ప్రధాన గేటు నిర్మాణాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

ధర్మవరం, జూలై 23 : పట్టణంలో చెలిమి ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన స్థలాన్ని కబ్జాకు యత్నించడమే కాకుండా... ఆ స్థలంలోకి వెళ్లడానికి దారి వదలాల్సిందేనని వైసీపీ నేతలు దౌర్జన్యకాండకు దిగారు. ఆ ఆలయ భద్రత కోసం నిర్మిస్తున్న గేటును ఆ నాయకులు సోమవారం ధ్వంసం చేశారు. సర్వేనెంబరు 441-8లో చెలిమి ఆంజనేయస్వామి ఆలయాన్ని దాదాపు 300 సంవత్సరాల క్రితం నిర్మించారు. ఆలయం శిథిలం కావడంతో ఆంజనేయస్వామి భక్తులంతా ఏకమై ఆలయ పునఃనిర్మాణం, స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ చేశారు. ఆ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల తాకిడి కూడా భారీగా పెరిగింది. దేవాలయానికి అనుకొని 63 సెంట్ల స్థలం ఆలయానిది ఉంది. ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి గతంలో వైసీపీ నేతలు యత్నించారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆ స్థలం ఆలయానికి సంబంధించిందేనని తీర్పు ఇచ్చింది. అయినా వైసీపీ నాయకులు ఆ స్థలాన్ని కబ్జా చేయడానికి నేటికీ కుట్రలు పన్నుతూనే ఉన్నారు. ఆలయ భద్రతలో భాగంగా కమిటీ సభ్యులు గేటు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. విషయం తెలుసుకున్న ఆ వైసీపీ నాయకులు గేటు నిర్మాణాన్ని సోమవారం కూల్చివేశారు. కమిటీ సభ్యులు ఎంత నివారించినా... ఆ నాయకులు ఈ అఘాయిత్యానికి పాల్పడటంపై భక్తులు మండిపడుతున్నారు.

సర్టిఫికెట్ల జారీలో జాగ్రత్తలు పాటించండి

కొత్తచెరువు, జూలై 23 : ప్రజలకు, విద్యార్థులకు కులం, ఆదాయం పత్రాల జారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రెవెన్యూ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక విజయనగర కాలనీలో కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాల ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేసమయంలో వారి వివరాలతో పాటు క్షేత్రస్థాయిలో వారు ఏ కులం, ఏ మతం, నిరుద్యోగులా, ఉద్యోగులా తదితర వివరాలను సేకరించిన అనంతరమే సర్టిఫికెట్లను జారీ చేయాలన్నారు. ఎలాంటి తప్పులకు తావివ్వకుండా జాగ్రత్తలు వీఆర్వో, ఆర్ఐ, డిప్యూటి తహసీల్దార్, తహసీల్దార్‌లు చూడాలన్నారు. అనంతరం స్థానిక శాఖాగ్రంథాలయాన్ని తనిఖీచేశారు. ఆయన వెంట తహసీల్దార్ కళావతి, డీటీ స్వాతి, వీఆర్వోవేణు, వీఆర్ఏలు శివసాయి, గంగాద్రి ఉన్నారు.

సిబ్బందిపై ఆగ్రహం : జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ స్థానిక విజయనగర కాలనీలో పర్యటిస్తూ ప్రధాన రహదారిపై చెత్త కుప్పలు ఉండటాన్ని చూసి పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారులే ఇలా ఉంటే.. ఇక గ్రామంలో పరిశుభ్రత ఏ విధంగా ఉంటుందో దీనిని బట్టే అర్థమవుతుందని అసహనం వ్యక్తం చేశారు. ఇలా అయితే రోగాలా రావా అని ప్రశ్నించారు. పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నారు... వీటిపై పర్యవేక్షణ లేదా.. అని ఆయన మండిపడ్డారు.


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జేసీ

దుర్గమ్మకు బోనాలు

ధర్మవరం, జూలై 23: ఆషాఢ మాసం మంగళవారం సందర్భంగా స్థానిక దుర్గమ్మ ఆలయంలోని అమ్మవారికి పట్టణంలో పలు ప్రాంతాలకు చెందిన మహిళలు బోనాలు సమర్పించారు. ప్రియాంకనగర్, సిద్దయ్యగుట్ట, దుర్గానగర్, యాదవవీధి, లోనికోట ప్రాంతాలకు చెందిన మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న ప్రియాంకనగర్, సిద్ధయ్యగుట్ట మహిళలు

ఇంకా వీడని నిద్ర మత్తు

బత్తలపల్లి, జూలై 23: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా అధికారులు ఇంకా నిద్ర మత్తు వీడలేదు. ఇప్పటికీ వైసీపీ సేవలో తరిస్తున్నారు. బత్తల పల్లి మండలంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఇతర కార్యాలయాల్లో ఇప్పటికీ జగన్ ఫొటోలు, జగన్ ప్రభుత్వ హయాంలోని పేర్లు కనిపిస్తూనే ఉన్నాయి. స్థానిక బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగన్ ఫొటోతో ఉన్న బోర్డును అలాగే ఉంది. అక్కడ పనిచేసే వైద్యాధికారి వైసీపీకి అనుకూలంగా ఉండటం వల్లనే ఆ బోర్డును తీసేయడానికి ఇష్టపడలేదనే ఆరోపణలున్నాయి. అదే విధంగా బత్తలపల్లి-2 రైతు భరోసా కేంద్రంలో ఇప్పటికీ ఆ భవనానికి ఉన్న వైఎస్ఆర్ అనే పేరు ఉంది. అదే విధంగా మండలంలోని గరిశనపల్లిలో కూడా ప్రభుత్వ లైబ్రరీకి వైఎస్ఆర్ పేరును తొలగించలేదు.



గరిశనపల్లిలో వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ



బోర్డుపై వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం


ప్రభుత్వాస్పత్రిలో జగన్ ఫొటో

త్వరలో సొసైటీలకు ఎరువులు : ఏడీ

ఓబుళదేవరచెరువు, జూలై 23: త్వరలో సొసైటీలకు అన్నిరకాల ఎరువులు ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా అందించ నున్నట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... సొసైటీలకు అన్నిరకాల ఎరువులు అందించ డానికి సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరిస్తున్నా మన్నారు. సొసైటీలు లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకున్న వెంటనే ఎరువులు ఇవ్వడానికి ప్రణాళికలు ఏర్పాటు చేశామ న్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయిస్తా మన్నారు. మండలంలో 65మంది కౌలు రైతులను గుర్తించా మని, వారికి త్వరలో గుర్తింపుకార్డులు ఇస్తామని తెలిపారు. వీరికి ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలబీమా ప్రభుత్వ సౌకర్యాలు అందుతాయన్నారు. అనంతరం మండలంలోని శేషయ్యగా రిపల్లిలో రైతులు భాస్కర్‌నాయక్ సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుశనగకు సోకిన ఆకుముడత నివారణకు క్లోరిపైరీఫాస్ లీటర్‌కు రెండు ఎంఎల్ లేదా ట్రోఫీనోఫాస్ లీటర్‌కు రెండు ఎంఎల్ పిచికారి చేయాలన్నారు. ఆకుమచ్చ తెగుళ్లకు మ్యాంగోజెబ్ మూడు గ్రాములను లీటర్ నీటిలో, లేదా హెక్సాకోనాజల్ రెండు ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట ఏఓ ఇలియాజ్ అహమ్మద్, ఆర్బీకే సిబ్బంది సరస్వతి, నరేంద్ర ఉన్నారు.

రాయితీ రైల్వే పాసులు పంపిణీ

కదిరిఅర్బన్ : దివ్యాంగులకు రైల్వే శాఖ మంజూరు చేసిన రాయితీ పాసులను ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ వంశీకృష్ణ పంపిణీ చేశారు. కదిరి నియోజకవర్గంలో 191 మందికి రైల్వే పాసులు మంజూరు చేశారన్నారు. పాసులు అందని దివ్యాంగులు ఆర్డీవో కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పుట్టపర్తిరూరల్, జూలై 23 : స్థానిక ప్రశాంతి నిలయంలోని సెక్యూరిటీ వింగ్ పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ వీ రత్న మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఆధ్యాత్మిక కేంద్రమైన ప్రశాంతి నిలయానికి దేశవిదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారని, వారికి ఎలాంటి భద్రతా లోపాలు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సెక్యూరిటీ వింగ్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ ఎస్సై ప్రదీప్‌కుమార్ ఉన్నారు. అలాగే జిల్లా కేంద్ర పరిధిలోని రూరల్ పోలీసుస్టేషన్‌ను ఎస్పీ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను, ముఖ్యమైన సీడీ ఫైల్స్‌ను తనిఖీ చేశారు. రాత్రివేళల్లో పెట్రోలింగ్, గస్తీ విధులు ముమ్మరం చేసి నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. సాయంత్రం వేళల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు.

మధ్యాహ్న భోజనం...

ముదిగుబ్బ : మండల పరిధిలోని మలకవేముల క్రాస్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

కలెక్టర్, ఎస్పీకి శుభాకాంక్షలు


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పరిటాల శ్రీరామ్

పుట్టపర్తి రూరల్, జూలై 23: జిల్లా కలెక్టరు టీఎస్ చేతన్, ఎస్పీ వీ. రత్నను ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. నియోజక వర్గం శాంతిభద్రతలపై ఎస్పీతో చర్చించారు. నియోజకవర్గంలో చట్టాలకు అతీతంగా ఎవరు వ్యవహరించినా రాజకీయాలకు అతీతంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అందుకు తాము పూర్తిగా సహకరిస్తామని శ్రీరామ్ ఎస్పీకి తెలిపారు. అలాగే పెనుకొండ సబ్ కలెక్టరు అపూర్వభరత్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఎస్పీ వీ రత్నను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాకారులకు స్పెయిన్ బృందం చేయూత


క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న స్పెయిన్ బృందం

ధర్మవరం, జూలై 23 : స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలకు చెందిన బాస్కెట్ బాల్ క్రీడాకారులకు స్పెయిన్ బృందం చేయూతనిచ్చింది. ఆ పాఠశాల క్రీడామైదానంలో మంగళవారం స్పెయిన్ దేశానికి చెందిన అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ కోచ్‌లు మౌర్, ఒరియల్, నటాలియా, పోల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు, షూస్, బాల్స్‌లను అందజేశారు. వాటిని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా క్రీడాకారులకు అందజేశారు. శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... పట్టణంలోని క్రీడాకారులకు స్పెయిన్ దేశానికి చెందిన కోచ్‌లతో ఉచితంగా ఉదయం, సాయంత్రం శిక్షణ ఇవ్వడం హర్షనీయమన్నారు. క్రీడాకారులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ సంజయ్, ఆత్మీయట్రస్టు సభ్యులు జస్వంత్, హరిజిత్ ప్రణవ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

కదిరిఅర్బన్, జూలై 23: చిరుధాన్యాల సాగుపై మండలంలోని కదిరి బత్తలపల్లి, వీరచిన్నయ్యగారిపల్లి గ్రామాల్లో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ... వర్షాభావ పరిస్థితులకు తట్టుకోవడంతో పాటు, పౌష్టికాహార విలువలున్న చిరుధాన్యాలను రైతులు సాగుచేయాలన్నారు. స్వల్ప వ్యవధిలోని దిగుబడి చేతికొచ్చే చిరుధాన్యాల సాగును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. అనంతరం బత్తపల్లిలో రైతులు సాగుచేసిన చిరుధాన్యల పంటలను పరిశీలించి, సూచనలు, సలహాలిచ్చారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారులు శ్రీనివాసరెడ్డి, శశిధర్‌రెడ్డి, ఆత్మా సిబ్బంది, ఎంపిఇఓలు, విహెచ్ఎలు, రైతులున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ


రికార్డులు తనిఖీ చేస్తున్న పీడీ

ఓబుళదేవరచెరువు, జూలై 23: మండలంలోని కొండకమర్ల పంచాయతీలోని వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో మంగళవారం ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరీ విచారణ చేపట్టారు. ఆమె ఆ గ్రామానికి వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామస్థులు, లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ కార్యకర్తపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేంద్రాన్ని పరిశీలించామన్నారు. పిల్లలకు పౌష్టికాహారం పంపిణీలో జరుగుతున్న లోపాలు కొన్నింటిని గుర్తించామన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆమె వెంట సీడీపీఓ వరలక్ష్మీ, సూపర్‌వైజర్ విజకుమారి ఉన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్


ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం, జూలై 23: స్థానిక మార్కెట్ యార్డ్‌లో గోదాముల్లో భద్రపరచిన ఈవీఎంలను కలెక్టర్ టీఎస్.చేతన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉపయోగించుటకు వీలు కానీ ఈవీఎంలను మరమ్మతుల నిమిత్తం బెంగుళూర్‌లోని బెల్ కంపెనీకి పంపుతామన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, కలెక్టర్ ఎన్నికల డిటీ షైనావుద్దీన్, తహసీల్దార్ రమేశ్ ఉన్నారు.

కదిరి, రాయచోటి రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న దృశ్యం

నంబులపూలకుంట, జూలై 23: కదిరి, రాయచోటి రోడ్డుపై ఉన్న పెద్ద పెద్ద గుంతలను, రోడ్డుకు ఇరువైపులా ఉన్న గుంతలను పూడ్చే కార్యక్రమం కొనసాగుతోంది. మంగళవారం సోలార్ కొత్తరోడ్డు వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, దేవరచెరువు వంక, కొత్త రోడ్డు సమీపంలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో ఈ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు ఇబ్బందులు పడేవారు. అనేక మంది వాహన దారులు అదుపుతప్పి కిందపడి గాయపడిన సంఘటనలు అనేకమున్నాయి. గుంతలు పూడ్చడంపై ప్రయాణీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు కౌన్సెలింగ్

గాండ్లపెంట, జూలై 23: మండలంలోని తాళ్లకాలువ, గాండ్లపెంటకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ఎస్ఐ క్రిష్ణవేణి మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐదు రోజుల క్రితం తూపల్లి గ్రామంలో మొహరం వేడుకల్లో ఈ విద్యార్థులు గొడవకు పాల్పడ్డారు. అంతేకాకుండా ఆ గొడవ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వీడియోలను డిలీట్ చేయించారు. విద్యార్థులు గొడవలకు దిగి, వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టకూడదని చెప్పామని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపామని ఎస్ఐ తెలిపారు.

జలధికి తరలిన పీర్లు


అమడగూరులో జలధికి తరలుతున్న పీర్లు


బుక్కపట్నంలో పీర్ల ఊరేగింపు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : ధర్మవరంరూరల్ మండలంలోని తిప్పేపల్లి గ్రామంలో మంగళవారం జలదీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీర్లస్వాములు పెద్దకాశీం, చిన్నకాశీంస్వాములు, ఉజ్జనప్పస్వామి,బాబయ్యస్వామి, ఉస్సేన్‌కట్టి స్వాములకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు హాజరై చక్కెర చదివింపులు చదివించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమడగూరులో మంగళవారం పురవీధుల్లో పీర్లను ఊరేంచారు. సాయంత్రం పీర్ల జలధికి భక్తిశ్రద్ధలతో తరలించారు. ఓబుళదేవరచెరువు మండలంలోని గాజుకుంటపల్లి, వెంకటాపురం, అల్లాపల్లిఎర్రబల్లి తదితర గ్రామాల్లో మంగళవారం జలధి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుక్కపట్నంలోని పేట, కోట వీధుల్లో ఏర్పాటు చేసిన పీర్లను అగ్నిగుండం ప్రవేశం చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం పీర్లను బుక్కపట్నం చెరువులో జలధికి తరలించారు. గాండ్లపెంట మండలంలోని తాళకాలువ పంచాయతీలో నరి వేపరాల్లో పీర్లను ఊరేగించారు. గురువారం జలధికి తరలిస్తారు.


తిప్పేపల్లిలో జలధికి వెళ్తున్న పీర్లు


వెంకటాపురంలో ఊరేగింపు


వేపరాల్లో అలంకరణలో పీర్లు



వైర్లను కత్తిరించిన దృశ్యం

మోటార్లు మాయం

కాంట్రాక్టు సిబ్బంది ప్రమేయంపై అనుమానాలు



మూడు మోటార్లు ఉండాల్సిన చోట.. ఇలా రెండు మోటార్లే..

ఉరవకొండ, జూలై 23: మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ సమీపంలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ స్కీంకు సంబంధించిన మోటార్లు మాయమయ్యాయి. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ సమీపంలో నీటి పంపింగ్‌కు సంబంధించిన మూడు గదులలో ఎనిమిది మోటార్లు ఉండాల్సి ఉండగా ఆరు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రెండు ఎక్కడికి పోయాయో అధికారులకు అంతుచిక్కడం లేదు. పంప్‌హౌస్ గదులలోని 25హెచ్‌పీ మోటార్లు, 30హెచ్‌పీ మోటారు ఒకటి కనిపించడం లేదు. మోటార్ల విలువ సుమారు రూ.1.5లక్షల దాకా ఉంటుంది. మోటార్ల మాయం వెనుక గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం నిర్వహణకు సంబంధించిన వైసీపీకి అనుకూలమైన కాంట్రాక్టర్, సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ మోటారు తీసుకెళ్తున్న సమయంలోనూ కొంత మంది సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. నీటి పంప్‌హౌస్‌లోని ఫ్యూజు వైర్లు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన వైర్లను కూడా కత్తిరించి ఎత్తుకెళ్లారు. వీటి విలువ కూడా రూ.లక్షలకు పైమాటే. అధికారులు కాంట్రాక్టర్‌కు వత్తాసు పలకడం వల్లనే, ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోటార్లు లేని విషయం తమ దృష్టికి వచ్చిందని విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని డీఈ పేర్కొన్నారు.

సంతసం ఏదీ?

మార్కెట్‌లో మాయ !

- ఈనామ్ విధానంతో రైతులకు నష్టాలు
- వేలం పూర్తి అయినా తెలియని ధర
- ట్రేడర్లు నిర్ణయించిన మేరకే...
- మార్కెట్ యంత్రాంగం పర్యవేక్షణ కరువు
- అనంత సంతలో చితికిపోతున్న చీనీ రైతు



మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

అనంతపురంరూరల్, జూలై 23: పంట బాగా పండిందన్న సంబరంతో దిగుబడిని మార్కెట్‌కు తీసుకువస్తే, ఇక్కడ ధర ఎంత పలికిందో తెలియక రైతులు తికమక పడుతున్నారు. మాయా మార్కెట్‌తో నిలువునా మునిగిపోతున్నారు. ఆన్‌లైన్ విధానంలో ట్రేడర్లు రైతులకు పంగనామాలు పెడుతున్నారు. మార్కెట్‌లో వారు నిర్ణయించిందే ధర. ఈక్రమంలో అందినకాటికి రైతులను దోచుకుంటున్నారు. మార్కెట్ యంత్రాంగం పర్యవేక్షణ గాడి తప్పడంతో ట్రేడర్లు చెప్పిదానికి సిబ్బంది తలూపుతున్నారు. దీంతో రైతులకు పంట పండినా నష్టాలు తప్పడం లేదు. ఇదీ అనంతపురం మార్కెట్‌లో చీనీ రైతులు దుస్థితి.

ఆన్‌లైన్ విధానంతో రైతులకు పంగనామాలు..

ఆన్‌లైన్ విధానంలో రైతులకు ట్రేడర్లు పంగనామాలు పెడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ విధానంలో ట్రేడర్లు ముందుగానే తమకు కావాల్సిన దిగుబడి రకాన్ని ఎన్నుకుని రేటు కడుతున్నారన్న వాదనలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. వ్యాపారులతో ముందుగానే మాట్లాడుకుని వేలంలోకి దిగుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ట్రేడర్లు సిండికేట్‌గా మారి రైతులను దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేట్లను ఫలానా లాట్ ఇంతే కోడ్ చేయాలి. ఈరోజు ఇంతే ధర ఉండాలని నిర్ణయించి వేలంలో పాల్గొంటున్నట్లు విమర్శలున్నాయి. బహిరంగ వేలం కాకపోవడంతో వేలం పూర్తి అయ్యే వరకు తమ దిగుబడులు ఎంత ధరకు అమ్ముడుపోయాయో రైతులకు తెలియడం లేదు. ఒక వేళ ధర నచ్చక సరుకు వెనక్కు తీసువెళాదామంటే పచ్చి సరుకు కావడంతో వెళ్లలేని పరిస్థితి. దీంతో ట్రేడర్లు కట్టిందే ధరగా మారింది. ఆ రేటుకు తమ పంటను విక్రయించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. కాగా ఒక వేళ ఎవరైనా కొంత రేటు ఎక్కువ వేశారంటే ఇతర ట్రేడర్లు అందరూ ఆ ట్రేడర్‌పైకి ధ్వజమెత్తునట్లు తెలుస్తోంది. సోమవారం జరిగిన ఘటన ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఓ రైతుకు ఓ ట్రేడరు టన్ను రూ.18వేలతో కట్టించాడు. అలాంటి కాయలకే మరో ట్రేడర్ రూ.15వేలతో కట్టించాడు. దీంతో తక్కువ ధర పలికిన రైతు ట్రేడర్‌తో గొడవకు దిగాడు. ఈక్రమంలోనే వ్యవహారం రోడ్డుపై బైఠాయించి నిరసనకు దారితీసింది. ఈక్రమంలోనే సదరు ట్రేడర్ల మధ్య వాదనలు జరిగినట్లు తెలుస్తోంది.

లోపించిన పర్యవేక్షణ

మార్కెట్‌లో అధికార యంత్రాంగం పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు ఆయా వర్గాల నుంచే వినిపిస్తున్నాయి. ఇన్ని టన్నులు చీనీకాయలు మార్కెట్‌కు వచ్చాయి. వీటి ద్వారా మార్కెట్‌కు పన్నురూపంలో ఇంత ఆదాయం వచ్చిందని చెప్పుకోవడంతోనే అధికారులు సరిపెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో రైతులకు లాభం జరుగుతోందా? నష్టం జరుగుతోందా? అన్న విషయాల గురించి యంత్రాంగం పట్టించుకో వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ధర ఎంతో రైతులకు తెలియని దుస్థితి..

మార్కెట్‌లో ఈ-నామ్ విధానంలో చీనీ వేలం జరుగుతోంది. ఇది రైతులకు ఏవిధంగా మేలు జరుగుతుందో తెలియని పరిస్థితి. రైతులు మార్కెట్‌కు చీనీ కాయలను తీసుకురావడం. అతరువాత మార్కెట్ సిబ్బంది రైతుల వివరాలు, ఎంత దిగుబడి మార్కెట్‌కు తీసుకువచ్చారు? వంటివి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తరువాత వేలం నిర్వహిస్తున్నారు. మార్కెట్‌లోని ట్రేడర్లు నిర్ణయించిన ధరను మార్కెట్ సిబ్బంది రైతులకు తెలియజేస్తున్నారు. ఈప్రక్రియ అంతా ముగిసేసరికి రెండు మూడు గంటలు సమయం పడుతోంది. దీంతో రైతులకు తమ దిగుబడులు ఎంత ధర పలికాయో అంత వరకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ విధానంలో రైతులకు ఏమేలు జరిగుతుందో సంబంధిత అధికారులకే తెలియాలి. బహిరంగ వేలం నిర్వహిస్తే తమ దిగుబడులు ఎంత ధర పలుకుతున్నాయో రైతులకు స్పాట్‌లో తెలిసే వీలుంటుంది. ఈక్రమంలోనే ఆ ధరకు రైతు తమ దిగుబడులు ఇవ్వాలనుకుంటే ఇస్తాడూ, లేదంటే మరొకరికి విక్రయించుకునే వీలుంటుంది. ఆ విధంగా వేలం జరిగితే తమకు లాభ నష్టాలు తెలుస్తాయని రైతులు అంటున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఇవేవీ తెలియకపోవడంతో ట్రేడర్లు నిర్ణయించిన ధరకు తమ దిగుబడులను అమ్ముకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఒక్కరోజులోనే తగ్గించేశారు



ధర బాగుందని టన్నుకు పైగా కాయలను మార్కెట్‌కు తీసుకొచ్చా. టన్ను రూ.13వేలతో అమ్ముడుపోయాయి. నిన్నటి రోజునా ఇలాంటి కాయలే రూ.18వేలతో అమ్ముడుపోయాయి. ఒక్కరోజులోనే రేటు తగ్గించేశారు. మార్కెట్‌కు వచ్చేటప్పుడు కల్లూరు వద్ద రూ.16,500తో అడిగారు. ఇవ్వకుండా వచ్చినందుకు లాభం కంటే నష్టమే మిగిగింది.

- వెంకటేష్ నాయక్, రైతు పాళ్యంతండా, పామిడి మండలం

ఏమీ తెలియడంలేదు



మార్కెట్‌కు ఆరు టన్నులకు పైగా కాయలు తీసుకొచ్చా. ఆన్‌లైన్‌లో వేలం వేశారంటా. వేలం వేసి రెండు గంటలు(10.30గంటల సమయంలో) గడిచిపోయాయి. ఇంత వరకు ఎంత ధర పలికిందో తెలియడం లేదు. ఎంత రేటు కట్టారో ఎవరూ చెప్పడం లేదు. బహిరంగ వేలం నిర్వహిస్తే కనీసం ధరైనా తెలిసేదీ. ఆన్‌లైన్ విధానంతో ఏమీ తెలియడం లేదు.

- పక్కీరప్ప, రైతు, నాగలూరు, బత్తలపల్లి మండలం

రాక్రీట్ అక్రమాలపై
విచారణ జరిపించండి

ఇళ్ల నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అవినీతి

పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు ప్రారంభించండి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి



సీఎం చంద్రబాబునాయుడును కలిసి వివరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన రాక్రీట్ సంస్థపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆమె చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథిని కలిశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రాక్రీట్ సంస్థ పేరుతో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి సంబంధించిన సంస్థ కాంట్రాక్ట్ తీసుకుందన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే రూ.200 కోట్లు డబ్బులు కాజేశారన్నారు. రాష్ట్రంలో మొత్తం 3.15 లక్షల జగనన్న ఇళ్లల్లో 63 వేలు రాక్రీట్ సంస్థకే కేటాయించినట్లు వెల్లడించారు. ఉమ్మడి అనంతపురం, వైఎస్ఆర్, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లాల్లోని గృహనిర్మాణ పనులను రాక్రీట్‌కు అప్పగించారని ఆమె తెలిపారు.

టెండర్లే లేవు

నిబంధనల మేరకు రూ.పది లక్షలకు మించిన పనులకు టెండరు విధానాన్ని పాటించాల్సి ఉంది. అయితే రాక్రీట్ సంస్థకు ఇళ్లను కేటాయించే విషయం ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోలేదని ఆమె ఫిర్యాదు చేశారు. రూ.1,100 కోట్ల విలువైన పేదల ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బంధువు, అనుచరవర్గం డైరెక్టర్లుగా ఉన్న రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి కట్టబెట్టారన్నారు. తీసుకున్న పనులను కూడా సక్రమంగా చేయలేదన్నారు. ఇసుక, సిమెంటు, ఐరన్ పేరుతో పెద్ద ఎత్తున నిధుల దోపిడీ జరిగిందన్నారు. కొన్నిచోట్ల ఇళ్లు నిర్మించ కుండా బిల్లులు కాజేసినట్లు ఆరోపించారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయించాలని మంత్రిని కోరారు. ఈ విషయంపై గృహనిర్మాణశాఖ మంత్రి పార్థసారథి తీవ్రంగా స్పందించి అక్కడే సమావేశంలో ఉన్న హౌసింగ్ సెక్రటరీతో మాట్లాడి అన్ని వివరాలు సమగ్రంగా అందించాలని ఆదేశించారు.

అప్పర్ పెన్నార్ పనులు మళ్లీ ప్రారంభించాలి

రామగిరి మండలంలోని అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టుకు నీరందించే పనులు మళ్లీ ప్రారంభించాలన్నారు. 2018లో రూ.804 కోట్లతో పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్టుకు 53 కి.మీ మేర కాలువ తవ్వి హంద్రీనీవా నుంచి నీరు అందించాలని ప్రతిపాదించామన్నారు. అప్పట్లో నిధులు కేటాయింపులు కూడా జరిగినట్లు పరిటాల సునీత వివరించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని పూర్తిగా వదిలేశారన్నారు. పైగా పుట్టకనుమ రిజర్వాయర్‌ను రద్దు చేసి ముట్టాల, తోపుదుర్తి, దేవరకొండ రిజర్వాయర్లను తీసుకొచ్చారన్నారు. పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లు నిర్మించి పేరూరుకు నీరందిస్తామని తాము ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చినట్లు వివరించారు. వెంటనే ఈ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు.

పేరూరు ప్రాజెక్టుకు నిధులివ్వండి

పేరూరు ప్రాజెక్టు నిర్వహణకు నిధులు కేటాయించాలని కూడా ముఖ్యమంత్రి, జలవనరుల శాఖమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదేళ్లల్లో పేరూరు ప్రాజెక్టు నిర్వహణ సరిగా లేక అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్టును పరిశీలించి మరమ్మతులకు రూ. 1.26 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారన్నారు. 5, 8 గేట్లు పూర్తిగా విరిగిపోయాయన్నారు. రామగిరి మండలం నసనకోటలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఇంటర్మీడియట్ వరకూ ఉన్నతీకరించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఆ శాఖ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. అన్ని అంశాలు పరిశీలించి వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్‌కు అవకాశం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



ఎంపికైన జిల్లా సాఫ్ట్‌బాల్ జూనియర్ బాల, బాలికల జట్లు



ఎంపికైన జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్లు

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23: జిల్లా సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీటీ స్టేడియంలో జిల్లా జూనియర్, సీనియర్ బాల, బాలికల క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్ల వివరాలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు ప్రకటించారు.

సీనియర్ బాలుర జట్టు: మహేష్, వరుణ్‌కుమార్, అక్షయ్‌సాగర్, పృథ్వీరాజ్, శివకుమార్, సింహాద్రి, లక్ష్మీనారాయణ, వినోద్, లక్ష్మీకళ్యాణ్, తరుణ్‌సాయి, సుశాంత్, అరవింద్, ధనుష్, అబ్దుల్‌ఖాదర్, షాకీర్, నవీన్‌కుమార్.

సీనియర్ బాలికల జట్టు: లావణ్య, లక్ష్మీ, స్రవంతి, ధరణి, ఖ్యాతి, గౌరీ, మౌనిక, శిరీష, అమీదా, బసంతి, ఫాతిమా, నాగప్రసన్న, సుకన్య, నిహారిక, ప్రశాంతి, జ్యోతి.

జూనియర్ బాలికల జట్టు: చంద్రకళ, సరోజా, ఆశా, లక్ష్మీ, శ్రావణి, శృతి, పల్లవి, హాసిని, మానీ, ఉష, పల్లవి, సుజన్, రోహిణి, సుప్రియ, జాహ్నవి, చంద్రిక, నిఖి.

జూనియర్ బాలుర జట్టు: అరవింద్ రెడ్డి, చరణ్‌తేజ్, గణేష్, వసంత్‌కుమార్, సాయివెంకట్, అజయ్, చరణ్, జగదీష్, హేమచంద్ర, సురేష్, నాని, శశిధర్ కుమార్, మున్నా, సతీష్, మోక్షిత్‌వర్మ, భానుశంకర్. ఎంపికైన సీనియర్ జట్లు ఆగస్టు 10 నుంచి వినుకొండలో, జూనియర్ జట్లు ఆగస్టు 17 నుంచి శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, పీడీలు రామకృష్ణ, ప్రభాకర్, గోపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సంజీవులు, చంద్ర, లతాదేవి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకునేదెవరు?

మోడల్ స్కూళ్లలో ఇష్టారాజ్యం...!

కణేకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలేవీ?

తనిఖీలు మర్చిపోయిన విద్యాశాఖ అధికారులు


నేటికీ స్పందించని ఏడీ నాగరాజు



కణేకల్లు మోడల్ స్కూల్

అనంతపురం విద్య, జూలై 23: జిల్లా మోడల్ స్కూళ్లను గాలికి వదిలేసినట్లు అనిపిస్తోంది. ప్రిన్సిపాల్ నెలల తరబడి స్కూళ్లకు వెళ్లకున్నా..పట్టించుకునవారు లేరు. కణేకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆదినారాయణ నెలల తరబడి స్కూల్‌కు డుమ్మా కొట్టారు. స్కూల్ నిర్వహణను గాలికి వదిలేశారు. ఆయన స్కూల్‌కు వెళ్లకున్నా..అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు ఉంటున్నాయి. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో పెద్దసార్ యాడున్నాడో ...? శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే ఇంత వరకూ ఆ ప్రిన్సిపాల్‌పై జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. చర్యలు తీసుకోకపోగా...ఆయనకు సపోర్ట్ చేసిన మరో సీనియర్ పీజీటీకి మళ్లీ ఇప్పుడు పట్టం కట్టాలని చూస్తున్నట్లు సమాచారం. మొత్తంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్కూళ్ల తనిఖీలనే మరిచిపోయారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.





జూన్, జూలై నెలల్లో సంతకాలు చేయని ప్రిన్సిపాల్

దొంగల చేతికే తాళాలు...

కణేకల్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఆయన గత కొంత కాలంగా మోడల్ స్కూల్‌కు రావడం లేదు. జూన్, జూలై మాసాల్లో ఆయన స్కూల్‌లోనే అడుగు పెట్టలేదు. అయినా జీతం మాత్రం డ్రా చేస్తున్నారు. ఆయన స్కూల్‌కు రాకున్నా ఆయన తరఫున మరో సీనియర్ పీజీటీ సంతకాలు చేశారు. స్కూల్‌కు రాకుండా బయట తిరుగుతున్న ప్రిన్సిపాల్‌కు సీనియర్ పీజీటీ అన్ని రకాలుగా సహకరిస్తున్నట్టు సమాచారం. విధులకు డుమ్మా కొట్టే ప్రిన్సిపాల్‌కు మరొకరు సహకరిస్తుండటంపై అనేక విమర్శలు వస్తున్నాయి. ఏకంగా సంతకాల ఫోర్జరీ వ్యవహారం స్కూల్‌లో సాగుతోంది. అయితే ఇంత వరకూ ప్రిన్సిపాల్‌పై చర్యలు లేవు. ప్రిన్సిపాల్ వైఖరిపై తీవ్ర విమర్శలు వస్తుంటే...ఆయనకు సహకరించిన సీనియర్ పీజీటీకి ఇప్పుడు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలని విద్యాశాఖ అధికారులు చూస్తున్నట్టు తెలుస్తోంది.

నిద్ర మత్తులో అధికారులు

జిల్లా వ్యాప్తంగా 15 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 6000 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిని ఏడీ నాగరాజు పర్యవేక్షిస్తున్నారు. అయితే ఆయన బాధ్యతలను పూర్తిగా గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. కణేకల్లు స్కూల్‌లో ప్రిన్సిపాల్ నెలల తరబడి హాజరుకాకున్నా గుర్తించలేదంటే ఏడీ పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. గతంలో జిల్లాకు వచ్చిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మోడల్ స్కూల్ ఏడీ తీరుపై ఫైర్ అయ్యారు. అయినా ఆయనలో మార్పు కనిపించడంలేదు. అటు విద్యాశాఖ ఉన్నతాధికారులు సైతం మోడల్ స్కూళ్ల పర్యవేక్షణను గాలికి వదిలేయడంపై అనేక విమర్శలు వస్తున్నాయి.

సమష్టిగా పనిచేద్దాం

ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్

అనంతపురం రూరల్, జూలై 23: సంస్థ కోసం సమష్టిగా పనిచేద్దామని ఏపీఎస్పీడీసీఎల్ అనంతపురం సర్కిల్ ఎస్ఈ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఉమ్మడి జిల్లాలోని పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనమంతా ఒక కుటుంబ సభ్యులమని, సంస్థ కన్నతల్లిలాంటిందని, సంస్థను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సంస్థలోని అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించా లన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవాలందిచాలని సూచించారు. ఎవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తేవాలన్నారు.



విద్యుత్ శాఖ ఎస్ఈకి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న ఉద్యోగులు

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 23: వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విభిన్న ప్రతిభావంతులు కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాల ని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ అబ్దుల్ రసూల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల విభిన్న ప్రతిభావంతులు www.awards.gov.in లేదా www.depwd.gov.in వెబ్‌సైట్‌లలో పొందుపరిచిన సామాజిక సేవా కార్యక్రమాలను ఎంపిక చేసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.

టమోటా కిలో రూ.53

అనంతపురం రూరల్, జూలై 23: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.53తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.40, కనిష్ఠ ధర రూ.15 పలికినట్లు ఆయన తెలిపారు.

పెండింగ్ డబ్బులు త్వరలో జమ

జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీరరాజు

అనంతపురం అర్బన్, జూలై 23: వాహన యజమానులకు పెండింగ్ డబ్బులను త్వరలోనే జమ చేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ట్రాన్స్ పోర్టు అధికారి వీరరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల వరకు రెవెన్యూ శాఖకు ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి రూ.2.08 కోట్లను ఆయా వాహనదారుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఎన్నికల తర్వాత రెవెన్యూ, పోలీసు శాఖలకు ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి ఇంకా రూ.33 లక్షలు పెండింగ్‌లో ఉందన్నారు. ఎన్నికల ముందు వరకు పోలీసు శాఖకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించి ఇది వరకే రూ.36 లక్షలు జమైందన్నారు. వివిధ నియోజకవర్గాల్లో పోలీసులకు ఏర్పాటు చేసిన వాహనాలకు రూ.28 లక్షలు జమ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంలో వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పెండింగ్‌లోని డబ్బులు జమ చేసేలా చూస్తామన్నారు. ఇంకా ఏమైనా సందేహాలుంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు.

ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలి: ఎస్టీయూ



డీడీతో మాట్లాడుతున్న ఎస్టీయూ నేతలు

అనంతపురం విద్య, జూలై 23: ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు ఏపీజీఎల్ఐ డీడీ భాస్కర్ తేజనాథ్‌ను కోరారు. సంగమేష్ నగర్ సమీపంలోని కార్యాలయంలో మంగళవారం ఆయనను కలిశారు. ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు ఉద్యోగులకు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రుణాలు, మిస్సింగ్స్ క్రెడిట్స్, ఇప్పటికే దరకాస్తు చేసిన అన్ని బాండ్ల క్లెయిమ్స్‌ను కూడా వెంటనే పరిష్కరించాలని విన్నవించారు. నాయకుల డిమాండ్లపై ఆయన సానుకూలంగా స్పందించారు. తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, రాష్ట్ర అదనపు కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణ మోహన్, ఫణిభూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు నాగభూషణ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

265 చెరువులకు నీరందించాలి

హంద్రీనీవా కాలువలో పూడికతీత పనులు చేపట్టాలి : జలసాధన సమితి

హిందూపురం అర్బన్, జూలై 23: హంద్రీనీవా కాలువ పూడిక తీసి, మరమ్మత్తులు చేపట్టి మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 265 చెరువులకు నీరందించాలని జలసాధన సమితి నాయకులు మంగళవారం ఇరిగేషన్ డీఈ యోగానంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పూర్తిగా కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోయిందన్నారు. దీంతో కాలువలో నీరు ప్రవహించే వీలు లేకుండా ఇబ్బందికర వాతావరణం నెలకొందన్నారు. వర్షాకాలం మొదటి దశలోనే చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో 265 చెరువులకు నీరు నింపాల్సి ఉండగా కేవలం 30 నుంచి 40 చెరువులకు మాత్రమే నింపుతున్నారన్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, పెనుకొండ ఎమ్మెల్యే, మంత్రి సవిత, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు ప్రత్యేక చొరవ తీసుకొని చెరువులు అన్నింటికీ నీరు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ధనాపురం వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, ఓపిడిఆర్ శ్రీనివాసులు, తిప్పేస్వామి, నవీన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


డీఈకి వినతి పత్రం అందజేస్తున్న జలసాధన సమితి నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బడ్జెట్‌పై టీడీపీ హర్షం

పెనుకొండ టౌన్, జూలై 23 : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అధిక నిధులు కేటాయించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి నిర్మాణానికి రూ. 15,000 కోట్లు కేటాయించడం శుభపరిణామమన్నారు. బెంగళూరు, హైదరాబాద్, విశాఖ, చెన్నై పారిశ్రామిక కారిడార్, కొన్ని పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేస్తుండటంతో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తగ్గనుందని హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి నిధులు కేటాయించడంలో శ్రమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, సిద్దయ్య, నాయకులు, కేశవయ్య, మాధవనాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, రమణమ్మ, త్రివేంద్ర, బాబిరెడ్డి, క్రిష్ణమూర్తి, అశ్వర్థప్ప, జనసేన నాయకులు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.8.34 లక్షలు


హుండీ సొమ్ము లెక్కిస్తున్న భక్తులు

మడకశిర రూరల్, జూలై 23 : మండలంలో ప్రసిద్ధి చెందిన భక్తరహళ్ళి నరసింహాస్వామి, జిల్లేడగుంట అంజనేయస్వామి దేవాలయాల్లో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టారు. దేవదాయశాఖ ఈఓ తెలిపిన వివరాల మేరకు రెండు ఆలయాల హుండీల నుంచి రూ.8.34 లక్షలు భక్తులు సమర్పించారు. అందులో భక్తరహళ్ళి నరసంహస్వామి ఆలయహుండీ నుంచి రూ.6.03 లక్షలు, జిల్లేడకుంట ఆంజనేయస్వామి హుండీ నుంచి రూ.2.30 లక్షలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ జ్యూవెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ పాండురంగారెడ్డి, స్థానిక అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎం, డీసీఎం ఫొటోల అందజేత


ఫొటోలు అందజేస్తున్న శంకరగల్లు టీడీపీ నాయకులు

గుడిబండ, జూలై 23 : మండలంలోని శంకరగల్లు గ్రామ సచివాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మడకశిర శాసనసభ్యులు ఎంఎస్ రాజు చిత్రపటాలను టీడీపీ నాయకులు రంగస్వామి అందజేశారు. కార్యక్రమంలో నరేంద్ర, లక్ష్మీనారాయణ, బాదిపల్లప్ప, గోవిందగౌడ్, శీనప్ప, నాగేంద్రప్ప తదితరులు ఉన్నారు.

సొంత పిల్లల్లా భావించాలి

- విద్యార్థులపై ఉపాధ్యాయులు వివక్ష చూపరాదు
- టీచ్ టూల్ లో అబ్జర్వర్ అబ్రహం

హిందూపురం అర్బన్, జూలై 23: పాఠశాలల్లో విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి పాఠ్యాంశాలు బోధించాలని టీచ్‌టూల్ అబ్జర్వర్, కో ఆర్డినేటర్ అబ్రహం పేర్కొన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని ఎంజీఎం పాఠశాలలో 9 రోజుల పాటు జరుగనున్న టీచ్ టూల్ కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధన ఎలాగుందో లోతుగా పరిశీలించాలన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల పట్ల వివక్ష చూపరాదన్నారు. సరిగా చదవని పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, మడకశిర, గుడిబండ, అమరాపురం, అగళి, రొళ్ళ మండలాల సీనియర్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, ఎంఈఓ-2 ప్రసన్నలక్ష్మీ, మాస్టర్ ట్రైనర్ రాజు, ఓబులేసు, ఉపాధ్యాయులు హాజరైనారు.

జలధికి తరలిన పీర్లు


బూదిలిలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్థులు

పెనుకొండ రూరల్, జూలై 23 : మొహరం పండగను పురస్కరించుకుని గ్రామాల్లో ఏర్పాటైన పీర్లస్వాములకు మంగళవారం జలధికి తరలించారు. మంగళవారం మండలంలోని మునిమడుగు, దుద్దేబండ గ్రామాల్లో పీర్లస్వాములను భక్తి, శ్రద్ధలతో ఊరేగించారు. వారం రోజులుగా ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో భక్తులు పీర్లతో నడిచారు. అనంతరం పీర్లను జలధికి తరలించారు.

హిందూపురం(సోమందేపల్లి) : మండల పరిధిలోని మంచేపల్లి గ్రామంలో మంగళవారం జల్దీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో పీర్లను డప్పుల వాయిద్యాల నడుమ, నృత్యాలు చేస్తూ ఊరేగించారు. జనసందోహం నడుమ జల్దీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

గోరంట్ల: మొహరం సందర్భంగా మండలంలోని బూదిలి, పాలసముద్రం, కొండాపురం, వానవోలుతండాల్లో జలధి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో చావిడి వద్ద పీర్లను నిలిపి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అగ్నిగుండం ఏర్పాటుచేసి చిన్నపెద్ద తేడాలేకుండా చిందులేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. పీర్లను పురవీధుల్లో ఊరేగిస్తూసంప్రదాయ పద్ధంగా జలధినిర్వహించారు. ఈవేడుకల్లో హిందూ ముస్లింలు ఐకమత్యంతో నిర్వహించగా, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


వేడుకలో పాల్గొన్న భక్తులు

ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి : టీడీపీ


దరఖాస్తులను విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, జూలై 23 : డీఎస్సీ అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో డీఎస్సీ కోచింగ్ అప్లికేషన్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న మొదటి సంతకంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖమంత్రిగా బాధ్యతలు తీసుకున్న మంత్రి సవిత ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు మంత్రి తొలి సంతకం చేశారన్నారు. ఇందులోభాగంగా పెనుకొండలో బీసీ వెల్ఫేర్ కార్యాలయం నుంచి నేటి నుంచి ఈనెల 31వరకు ఉచిత డిఎస్సీ కోచింగ్ అప్లికేషన్లను జారీచేస్తున్నామన్నారు. రెండు నెలల కోచింగ్, అభ్యర్థులకు స్టేఫండ్, స్టడీ మెటీరియల్, ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఎస్సీ ఎగ్జామ్‌లు రాసే అభ్యర్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీవెల్ఫేర్ అధికారి గంగాధర్, టీడీపీ నాయకులు త్రివేంద్రనాయుడు, నరేంద్ర, సుబ్రమణ్యం, చెన్నరాయుడు, సోము, గోపాల్, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం


ప్రత్యేక అలంకరణతో కొల్లాపురి అమ్మవారు

మడకశిర రూరల్, జూలై 23 : మండలంలోని సీ కోడగేపల్లి గ్రామంలో వెలసిన కొల్లాపురమ్మ దేవి, అంజనేయస్వామి జ్యోతుల ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఐదో వార్షికోత్సవ సందర్భంగా గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను తయారుచేసి వాటిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారి ఆలయం చూట్టు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.


జ్యోతులతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు


మంత్రి అనితతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ నాయకులు

హోంమంత్రితో ఎమ్మెల్యే భేటీ

మడకశిర టౌన్, జూలై 23: అమరావతిలోని సచివాలయంలో హోంమంత్రి వంగలపూడి అనితను మంగళవారం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడిని టీడీపీ నాయకులతో కలిసి మడకశిర నియోజకవర్గ సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. మడకశిర అభివృద్ధికి సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు గోవిందప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగరాజు ఉన్నారు.

గ్రామసభలో సమస్యల వెల్లువ

హిందూపురం(పరిగి), జూలై 23: మండల పరిధిలోని కొడిగెనహళ్లి సచివాలయం -1లో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో గ్రామసభ నిర్వహించారు. సభకు హాజరైన పంచాయతీ ప్రజలు తమ పరిధిలోని డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్‌కు సంబంధించి పలుసమస్యలపై అధికారులను ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా 16వ విడత నిధులు మంజూరై వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం మరుగుదొడ్ల నిర్మాణానికి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ సత్యనారాయణ, పెద్దరెడ్డిపల్లి ప్రవీణ్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, రంగనాథ్, వీరలింగ, ఆనంద్, తదితర ప్రభుత్వ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

మడకశిర రూరల్, జూలై 23: మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో ఆధార్ సెంటర్ల క్యాంప్ నిర్వహిస్తున్నందున గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ పరిపాలన అధికారి ఆరాధ్య తెలిపారు. మంగళవారం ఆమిదాలగొంది సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరాధ్య మాట్లాడుతూ 24 న ఛత్రం, ఆర్ అనంతపురం, బుళ్ళ సముద్రం పంచాయతీల ప్రజలు బుళ్ళసముద్రం గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలు పొందలాన్నారు. 25న మణూర్, కల్లుమర్రి, సీ కోడిగేపల్లి గ్రామాల ప్రజలు మణూరు సచివాలయంలో, 26న భక్తరహళ్ళి, హరేసముద్రం, వై బీ హళ్ళి గ్రామాలు హరేసముద్రం సచివాలయంలో, 27 కదిరేపల్లి, మెళవాయి, గోవిందాపురం, జీ వీ పాళ్యం, గుండుమల గ్రామాల ప్రజలు కదిరేపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్ సేవలు పొందాలన్నారు.


ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ ఆరాధ్య

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

బుక్కరాయసముద్రం, జూలై 23: మండల కేంద్రంలోని హెచ్ఎల్సీ వద్ద మం గళవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో బండి తిరుపాలు (64) అనే రైతు మృతి చెందాడు. బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన బండి తిరుపాలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. అతడు మంగళవారం ఉదయం ఇంటి నుం చి ద్విచక్రవాహనంలోతన వ్యవ సాయ తోట వద్దకు వెళ్తున్నాడు. స్థానిక హెచ్చెల్సీ వద్ద యూటర్న్ తీసుకుంటున్న సమయంలో తాడిపత్రి వైపు నుంచి అనంతపురం వస్తున్న మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన తిరుపాలును అనంతపురం అసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందారు.

జేసీ ఆకస్మిక తనిఖీ


వైద్యులతో సౌకర్యాలపై ఆరాతీస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పెనుకొండ టౌన్, జూలై 23 : పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు జేసీ అభిషేక్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పట్టణంలోని స్టాక్‌పాయింట్, లైబ్రరీ, ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈయన వెంట సబ్ కలెక్టర్ అపూర్వభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులవద్ద నిర్లక్ష్యం వహించరాదని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ ప్రభావతి, కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్ పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు


భోజనం వడ్డిస్తున్న ఏఎస్ఐ మురళి

హిందూపురం(సోమందేపల్లి), జూలై 23: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 50మందికి పరీక్షలు నిర్వహించగా పది మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు తెలిసింది. మెడికల్ ఆఫీసర్ హరి, వైద్యులు ఓంకార్ ఆధ్వర్యంలో ఐరన్, సుక్రోజ్ మాత్రలు అందించారు. అనంతరం బద్రీ హోటల్ యజమాని గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు ఏఎస్ఐ మురళిమోహన్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ గుప్త, మంజునాథ్, సూపర్‌వైజర్ రవీంద్ర, రత్నమ్మ, వెంకటేశ్, సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పందుల బెడదను అరికట్టాలని టీడీపీ నాయకుల వినతి

మడకశిర టౌన్, జూలై 23: నగర పంచాయతీ పరిధిలోని 15,16, వార్డులతో పాటు మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో పందుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని టీడీపీ కౌన్సిలర్ నరసింహరాజు, పట్టణ వాసులు మంగళవార కమిషనర్ రంగస్వామికి వినతి పత్రం అందజేశారు. పందుల కారణంగా విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని, వాటిని పట్టుకుని దూరంగా వదిలివేయాలన్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు వ్యాపిస్తున్నాయన్నారు. స్పందించిన కమిషనర్ పందుల యజమానులను పిలిపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

రేపు ప్రజావేదిక

గోరంట్ల, జూలై 23: మండలంలో గత ఏడాది జరిగిన సామాజిక తనిఖీలో భాగంగా గురువారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 17వ సామాజిక తనిఖీల్లో భాగంగా ఏప్రిల్ 2023నుంచి మార్చి 2024 వరకు జరిగిన పనులపై తనిఖీల ద్వారా గ్రామసభలను క్షేత్రస్థాయిలో నిర్వహించారు. గురువారం ఉదయం 10గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

గోరంట్ల, జూలై 23: మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఉంచిన ద్విచక్రవాహనం చోరీ అయినట్లు మంగళవారం బాధితుడు ఫిర్యాదు చేశారు. సీఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాల మేరకు చిలమత్తూరు మండలంలోని శానగానిపల్లికి చెందిన రాజేష్ కియా పరిశ్రమలో పనిచేస్తున్నారు. స్వగ్రామంనుంచి రాజేష్ ద్విచక్రవాహనంపై గోరంట్లకు వచ్చి పెట్రోల్ బంక్ వద్ద వాహనం ఉంచి, పరిశ్రమకు వెళ్లి రాత్రి విధులు అనంతరం ఉదయం తీసుకెళ్లేవారు. ఈనెల 21 ఉదయం ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో రూ.35వేలు విలువ చేస్తే ప్యాన్‌ప్రో ద్విచక్రవాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

పెనుకొండ, జూలై 23: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం న్యాక్ బృందం సందర్శించింది. మంగళవారం న్యాక్ బృందం కళాశాలను సందర్శించి అధ్యాపకులు తయారుచేసిన ఐదు సంవత్సరాల రికార్డును పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పరిశీలించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో సమావేశమై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు కోలాటాలు, చెక్కభజన బృందం సభ్యులను ఆకట్టుకుంది. న్యాక్ బృందం పరిశీలన రెండోరోజుకూడా కొనసాగుతుందని ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాక్ ఛైర్ పర్సన్, ప్రొఫెసర్ రాజేంద్రసింగ్, సాంగ్‌వన్, సభ్యులు ప్రొఫెసర్ బబ్రాబల్లాన్‌పాల్, న్యాక్ సభ్యులు డా.పాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర, బిహార్‌కే బడ్జెట్‌లో ప్రాధాన్యం

పావగడ, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ప్రాధాన్యం ఇచ్చారని కర్ణాటక బుద్దసంఘం, అంబేడ్కర్ సంఘం నాయకులు మంగళవారం పావగడలో నిరసన వ్యక్తం చేశారు. కర్ణాటకను అన్నివిధాలా మోసం చేస్తూ ఆ రెండు రాష్ట్రాలకే అధిక నిధులు కేటాయించడం దారుణమన్నారు. వెనుకబడిన కర్ణాటకకు అన్యాయం చేశారని దళిత సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంఘాల బలోపేతానికి కృషి చేయాలి: ఏపీఎం

అగళి, జూలై 23: మహిళా సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం సురేష్ పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని త్రివేణి మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం యానిమేటర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ యానిమేటర్లు ప్రతి ఒక్కరూ సంఘం అభివృద్ధికి కృషిచేయాలన్నారు. సంఘాల రికవరీ లోన్లు ఇప్పించడం విధిగా ఉండాలన్నారు. బ్యాంకు లావాదేవీలు సంఘాల ఆర్థిక లావాదేవీలు పుస్తకాలలో సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు, మహిళా సంఘం అధ్యక్షులు కార్యదర్శులు ఆనిమేటర్లు సంఘం అధ్యక్షుడు సిద్దగంగప్ప, ఆనిమేటర్లు, సీసీలు తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడి మృతి

అగళి, జూలై 23: అగళి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీఎల్ ఫణీంద్ర కుమార్(50) మంగళవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన అకాల మరణానికి ఆర్యవైశ్యులు కమిటీ మెంబర్లు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఫణీంద్రకుమార్ మృతి తీరని లోటని, ఆయన ఆర్యవైశ్యుల ఐకమత్యానికి విశేష కృషి చేశారన్నారు. పలు పార్టీల నేతలు ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు.


ఫణీంద్ర(ఫైల్)

సచివాలయ సిబ్బందితో సమీక్ష

గోరంట్ల, జూలై 23: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయ, వార్డు సిబ్బందితో నోడల్ అధికారి శివారెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మందలపల్లి సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సదాన విధులకు సక్రమంగా హాజరుకాలని, టీడీపీ నాయకులు, గ్రామస్తులు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ సచివాలయాల బయో మెట్రిక్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రతిరోజు ఉదయం 10గంటలకు, సాయంత్రం 5గంటలకు తప్పకుండా బయోమెట్రిక్ వేయాలన్నారు. సమయ పాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం , వీధి దీపాల ఏర్పాటు, ఇంటి పన్నుల వసూళ్ల సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఈఓఆర్డీ సుధాకర్, ఏఓ సూర్యనారాయణ, ఎంపీడీఓ సిబ్బంది, ఆయా కార్యదర్శులు డిజిటల్, వెల్ఫేర్ ఆసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి నిధుల రికవరీకి ఆదేశం

హిందూపురం(సోమందేపల్లి), జూలై 23 : మండలంలో జరిగిన ఉపాధిహామీ పనుల్లో అధికారులు రికవరీకి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటుచేసిన ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందాల విచారణలో వెలుగు చూసిన వాస్తవాలను వారు అధికారుల ముందుంచారు. ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 16పంచాయతీల్లో 95పనులకుగాను రూ.4.70కోట్లు ఖర్చుచేశారు. రూ.85లక్షల సచివాలయ నిర్మాణానికి వినియోగించారు. ఇందులో రూ.29,950 పెన్నపరంగా రూ2.31లక్షలలో రూ.70వేలు రికవరీకి ఆదేశించారు. మిగిలిన రూ.54వేలకు విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రొసిడింగ్ ఆఫీసర్ శివశంకర్, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, డ్వామా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ఎస్ ఆర్పీ చంద్రమోహన్, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి ఈసీ గంగాధర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు సంఘటితంగా పోరాడాలి: సీఐటీయూ


మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

గోరంట్ల, జూలై 23: కార్మికులు సమస్యలపై సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని మాధవరాయ దేవాలయంలో సీఐటీయూ మండలస్థాయి కార్మికుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు పెడబల్లి బాబా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఐకమత్యంతో సమస్యల పరిష్కారం దిశగా పోరాటం సాగించాలన్నారు. కార్మికులకు సీఐటీయూ నిరంతరం అండగా ఉంటుందన్నారు. ఈసందర్భంగా మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. మండల కమిటీ కన్వీనర్‌గా కమల్‌బాషా, కో కన్వీనర్‌గా గంగాధర్, పదిమంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమానికి పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, రాము, ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు యూనియన్ జ్యోతి, పద్మా, ఆటో వర్కర్లు వలీ, బాషా, నాగరాజు తదితరులు హాజరయ్యారు.

5న సీఎం ఇంటి ఎదుట ధర్నా

పావగడ, జూలై 23: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 5న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇంటి ముందు ధర్నా చేయనున్నట్లు ఏఐటీయుసీ జిల్లా కన్వీనర్ గిరీష్ ప్రకటించారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల కష్టాలను పరిష్కరించేందుకు నిధులున్నప్పటికీ వాటిని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. రెండేళ్లనుంచి కార్మికుల బిల్లులకు మోక్షం కలిగించకుండా నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సీఎం ఇంటి ముట్టడితోనే సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నామన్నారు. కార్మికులంతా బెంగళూరుకు తరలిరావాలని పిలుపునిచ్చారు.